# శంకరాచార్యులు

ఆర్యాంబా, శివగురువుల పుత్రుడు ఈ పవిత్రుడు. కాలడి ఇతని జన్మస్థానము. ఇది కేరళలో కావేరీ తీరమున కలదు. వీరు నంబూద్రి బ్రాహ్మణ తెగకు చెందిన వారు. చిన్నవయస్సునందే పితృవియోగము ప్రాప్తించెను. అతి బాల్యమునందే వేదశాస్త్రములు పూర్తిగావించి పండితపామరులకు ఆశ్చర్యము కలిగించునంతటి పాండిత్యమును, తర్కమీమాంసలను పూర్తిగావించెను. లోకములోని పండితులనందరినీ జయించి కడకు మండనమిశ్రుని ఓడించి అనేకమందికి గురుస్థానమును అందించి లోకమునకు అద్వైతమును బోధింప సంకల్పించి దేశమున నలుమూలల పీఠములు స్థాపించి, ధర్మప్రచారము గావింప నియమించెను. తోటకుడు, హస్తామలకుడు, పద్మపాదుడు, సురేశుడు అను నలుగురిని శిష్యకోటిలోనుండి యేరి ఆ నాలుగు పీఠములకు అధిపతులుగా నియమించెను. ఇతడు గోవిందపాదులవారిని గురువుగా స్వీకరించి, అతని ఆదేశములననుసరించెను. అచంచల వైరాగ్యమే అతని పట్టు. అద్వైత సిద్ధాంతమే ఇతని గుట్టు. భిన్నత్వములోని ఏకత్వమును, సర్వశాస్త్రములలోని సత్యత్త్వమును, సమస్త సృష్టికి మూలమును ఒక్కడే కారణంబనియు, మట్టి లేని కుండ, దారము లేని వస్త్రము, బ్రహ్మము లేని ప్రకృతి లేదని చాటెను. 'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ' సృష్టి, సృష్టికర్త ఒక్కడేనని నొక్కి చెప్పెను. వేదప్రమాణమును అనేక రూపుల నిదర్శనములతో నిరూపించి, విచారించెను. 'అద్వైత దర్శనం జ్ఞానం' అనికూడను బోధించెను. వేదద్వేషులకు బుద్ధి చెప్పి జ్ఞానసిద్ధిని అందించిన మూలగురువు ఈ శంకరాచార్యులు. ఇతను స్థాపించిన మతమే అద్వైతమతమని పిలువబడెను.

**ఆచరణరాహిత్యం**

భారతదేశము సనాతన ధర్మమునకు ఆధ్యాత్మిక మార్గావలంబులైన మహర్షుల ప్రబోధ ప్రచారములకు నిలయము. ఇది పవిత్రమైన వేదభూమి, యోగభూమి, త్యాగభూమి. అయితే, ఈనాడు ఆ గౌరవమునకు తగినట్టుగా దేశపరిస్థితి వున్నదా లేదా అని ప్రతి భారతీయుడు విచారించక తప్పదు. అట్టి విచారణ సల్పిన, భారతీయ సంస్కృతి నేడు హాస్యాస్పదస్థితియందున్నదని సులభముగా తెలును. వేదసారమైన గాయత్రీమంత్రము వినిపించమానినది. ముక్కు పట్టుకోటముతో మాత్రము ఆచరింపబడుచున్నది. ప్రాణాయామము, ప్రత్యాహారములు పటాపంచలై యెక్కడనూ కనబడవు. యమనియమాదులు మాయమైనవి. సన్యాసులమని చెప్పుకొనేవారికి సంసారులకంటె అధికముగా పేరుప్రఖ్యాతులపై, ఆస్తిపాస్తులపై, వస్తువాహనాదులపై వ్యామోహము పెరుగుచున్నది. ఇట్టి విలక్షణమైన మూర్ఖులవలన ఇది భారతదేశమా అన్న సందేహమునకు అవకాశము దొరికినది. కృష్ణపరమాత్ముడు కాయమును వదలి నిరాకారరూపమును ధరించినప్పుడే, లోకమందు అధర్మము ప్రబలినది. తదుపరి యెంతోమంది పరమహంసలు, దైవాంశసంభూతులు ఉద్భవించి పరమపవిత్రమైన సనాతన ధర్మమును, పరమసత్యమును ప్రజలకు బోధించి వారిని తరింపజేయు నిమిత్తమై తమ జీవితమునంకితము చేసియున్నారు.

**ఏకం సత్**

పాలలోని వెన్నవలె, పూవులోని పరిమళమువలె, కట్టెలోని నిప్పువలె, ఫలములోని మధుర రసమువలె దివ్యత్వము ప్రతిమానవునియందు ఆత్మరూపమై ఉన్నది. దీనినే వేదాంతము, 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి' అన్నది. ఉన్నది ఒక్కటే. అది అనేకంగా కనిపిస్తున్నాది. రూపములు భిన్నభిన్నముగా గోచరించవచ్చు, రూపములకు

తగిన పేర్లు పెట్టుకోవచ్చు. కాని, అన్నింటికి మూలాధారమైన తత్త్వం ఒక్కటే. ఒక మామిడి విత్తనము నాటాము. అది కొంతకాలమునకు వృక్షముగా రూపొందింది. అందులో అనేక వందల ఆకులు, పుష్పములు, కాయలు ఉంటున్నాయి. కాయలతో ఊరగాయ వేసుకోవచ్చు. ఆకులను తీసి తోరణములు కట్టుకోవచ్చు. ఎండిపోయిన కొమ్మలను వంటచెఱకుగా ఉపయోగించుకోవచ్చు. అయితే ఈ కొమ్మలకు, రెమ్మలకు, ఆకులకు, ఫలములకు ఆ విత్తనమే మూలాధారముకదా! విత్తనము లేక వృక్షము లేదు. వృక్షము లేక కొమ్మలు లేవు, కొమ్మలు లేక కాయలు లేవు. ఇవన్నీ ఒకదానిపైనొకటి ఆధారపడియున్నవి. వీటన్నింటియొక్క యేకత్వాన్ని నిరూపించేదే అద్వైతము.

**బాల్యం**

ఈ అద్వైత సిద్ధాంతమును ప్రతిపాదించి, అద్వైత మతమును స్థాపించి ద్వైతభావము వలన మానవునిలో అభివృద్ధి అయిన రజోగుణమును అణగద్రొక్కి అజ్ఞానమును జ్ఞానజ్యోతిచే దూరముచేసే కొరకై శ్రీశంకరాచార్యులవారు కేరళ రాష్ట్రమందు 'కాలడి' అనే చిన్న పల్లెలో ఆర్యాంబ, శివగురువు అనే దంపతులకు జన్మించారు. దురదృష్టవశాత్తు అతని చిన్నతనములోనే తండ్రి మరణించాడు. అయితే మరణించటానికి పది దినములు ముందుగా శివగురువునకు ఒక కాంతిపుంజము కనిపించి కుమారునికి ఉపనయన సంస్కారము గావించమని ఆదేశించింది. తత్ప్రకారంగా శివగురువు తన కుమారునికి ఐదవ సంవత్సరమునందే ఉపనయనము చేశాడు. అప్పటినుండి ఈ పిల్లవాడు గాయత్రీ మంత్రోపాసన ప్రారంభించాడు.

శంకరాచార్యులవారి తండ్రి ప్రతి దినము రాజరాజేశ్వరీదేవి పూజ చేసి పాలను నైవేద్యం పెట్టి ఆ ప్రసాదమును తెచ్చి భార్యకు, కుమారునికి అందించేవాడు. ఒకనాడు అతడు యేదో పనిపై తప్పనిసరిగా ప్రక్క గ్రామానికి వెళ్ళవలసి రావడంచేత తన కుమారుని పిలచి, 'నాయనా! రేపటి దినమున నీవు రాజరాజేశ్వరికి పూజ చేసి పాలను నైవేద్యం పెట్టు. దానిని నీవు, నీ తల్లి తీసుకోవచ్చును' అన్నాడు. మరునాడు శంకరుడు తండ్రి ఆజ్ఞను శిరసావహించి ఒక కప్పులో పాలు తీసుకొని రాజరాజేశ్వరీ విగ్రహం ముందుంచి, 'తల్లీ! స్వీకరించు' అని ప్రార్థించాడు. కాని, ఎంతసేపైనప్పటికీ తల్లి రాలేదు. ఆ కప్పులో పాలు ఖర్చు కాలేదు. శంకరుడు అప్పటికి ఆరు సంవత్సరముల పిల్లవాడు. 'తల్లీ! ప్రతిరోజు నా తండ్రి తెచ్చిన పాలను త్రాగుతున్నావు కదా! మరి ఈరోజు నేను తీసుకొని వస్తే ఎందుకు త్రాగటం లేదు? నేనేం పాపం చేశాను?' అని చాలా బాధపడ్డాడు. కాని తన పట్టు వీడలేదు. 'తల్లీ! నీవీ పాలను త్రాగకపోతే నేను నా తల్లిదండ్రుల మనస్సును కష్టపెట్టిన వాడనౌతాను. తల్లిదండ్రులను సంతృప్తి పర్చలేని నా బ్రతుకెందుకు? కనుక, నేను ప్రాణత్యాగం చేస్తాను' అని శపథం చేశాడు. ఈ అమాయకుడు అన్నట్లుగానే ప్రాణం తీసుకుంటాడేమోనని రాజరాజేశ్వరి ప్రత్యక్షమై, 'నాయనా! నీ భక్తికి మెచ్చాను. ఇదిగో, నీవు తెచ్చిన పాలు త్రాగుతున్నాను. నీవింక సంతోషంగా ఉండు' అని పలికి ఆ కప్పులో ఒక్క చుక్కైనా మిగల్చకుండా పాలన్నీ త్రాగేసింది. శంకరుడు చూసాడు, 'అమ్మా! పాలన్నీ నీవే త్రాగితే నా తల్లికి ప్రసాదంగా యేమి యివ్వాలి? అంతా నేనే త్రాగేశా ననుకొంటుంది. ప్రతిరోజూ నా తండ్రి నీవు త్రాగిన పాలను తెచ్చి మాకిచ్చేవాడు. కనుక, కొన్ని పాలను తిరిగి యివ్వు' అన్నాడు. సముద్రంలో కలసిన గంగను తిరిగి వేరుచేయటానికి వీలవుతుందా? ఒకసారి త్రాగిన పాలను ఆమె తిరిగి యెలా తెచ్చి యివ్వగలదు? కాని, శంకరుడు తనకు కొంచెమైనా పాలు యివ్వాలని పట్టుపట్టాడు. లేకపోతే తన తల్లి దగ్గర తనకు చెడ్డపేరు వస్తుందని గట్టిగా వాదించాడు. అప్పుడు రాజరాజేశ్వరి కరుణించి తానే స్వయంగా తన పాలను పిండి అతనికిచ్చింది. ఆ పాలను త్రాగటంచేతనే శంకరులవారు జైత్రయాత్ర చేసి ప్రజలచేత పూజ లందుకోగలిగారు. ఆనాటినుండి అతనికి సమస్త వేదములు, శాస్త్రములు, ఉపనిషత్తులు కరతలామలకములైనాయి. ఆర్యాంబ ఆనాడు శంకరునితో, 'నాయనా! దేవీ అనుగ్రహాన్ని పొందిన నీకింక కొరతేమి? యావత్ప్రపంచమునకే నీవు ఆదర్శప్రాయుడవై సత్కీర్తిని పొందగలవు' అని ఆశీర్వదించింది.

**సన్యాసం**

తండ్రి మరణించిన తరువాత తల్లి ఆ దుఃఖాన్ని భరించుకొని ఈ పిల్లవానిని పెంచుతూ వచ్చింది. మొట్టమొదట ఒక గురువు దగ్గర యితనిని ప్రవేశపెట్టింది. ఆయన ఇతనికి అనేక విద్యలు నేర్పించాడు. ఆర్యాంబ గురువు వద్దకు వెళ్ళి తన కుమారునికి వివాహము చేయవలసిందిగా కోరింది. కాని, శంకరుడు తనకు వివాహం అక్కరలేదన్నాడు. 'నా దేహము, నా మనస్సు, నా సర్వస్వం భగవంతునికే అర్పితము చేస్తున్నాను. కనుక, నాకు వివాహం అక్కరలేద'న్నాడు. తాను సన్యాసము స్వీకరించాలని పట్టుపట్టాడు. తల్లి చాలా యేడ్చింది. సహజమే. కాని, శంకరుడు తన పట్టు వదలలేదు.

ఒకనాడు తల్లి నీటికోసమని నదికి వెడుతుండగా శంకరుడు వెనుకనే బయలుదేరాడు. 'అమ్మా! నేను సన్యసించటానికి అనుజ్ఞ యివ్వు' అని పదేపదే అడుగసాగాడు. కాని, ఆమె అంగీకరించలేదు. కావేరీలో దిగి నీరు ముంచుకుంటున్నప్పుడు సమయం చూసుకొని శంకరుడు కావేరీలో ఉరికాడు. ఒక చేయి పైకెత్తి, 'అమ్మా! నన్ను ఒక మొసలి మ్రింగుతున్నది. కనీసం యిప్పుడైనా నేను సన్యసించటానికి అనుజ్ఞ యివ్వు' అని గట్టిగా ప్రార్థించాడు. 'నాయనా! నీవు సన్యసించటం వల్ల కాపాడబడేటట్లైతే సన్యాసము తీసుకో, నీవు బ్రతికుంటే చాలు' అంది. గట్టుకు వచ్చిన తరువాత శంకరుడు తల్లితో చెప్పాడు, 'అమ్మా! సంసారమనే సముద్రంలో భార్య అనే మొసలి నన్ను మ్రింగటానికి ప్రయత్నించింది. కానీ, నేను సర్వసంగ పరిత్యాగం చేయటం వలన అది నన్ను వదిలి వేసింది'. తల్లికి నమస్కరించి యిల్లు వదిలాడు. 'నా అంత్య సమయంలో మాత్రం నీవు రావాలి' అని తల్లి కోరింది. 'తప్పక వస్తాన'ని వాగ్దానమిచ్చాడు.

గోవిందుడనే గురువు వద్ద చేరాడు. గోవిందుని గురువు గౌడపాదుడు. ఆయన కూడా ఋగ్వేదములో శంకరులవారికి చక్కని తర్ఫీదునిచ్చాడు. పదునాలుగు సంవత్సరములు పూర్తికాక పూర్వమే శంకరులవారు నాలుగు వేదములను, ఆరు శాస్త్రములను పఠించాడు. తర్కమీమాంసావ్యాకరణములను క్షుణ్ణంగా నేర్చుకున్నాడు. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం'. శ్రద్ధ కలిగిన వానికి యేదీ అడ్డు రాదు. శంకరులవారి మేధాశక్తికి గురువుకే ఆశ్చర్యం కలిగింది. ఒకనాడు శంకరుని పరీక్షించాలని గోవిందుడు అతనితో వాదమునకు పూనుకున్నాడు. శంకరుడు వినయవిధేయతలు కలవాడు. విద్యార్థికి వినయమే భూషణము కదా! కనుక, గురువుతో వాదోపవాదములకు పూనుకునేముందు అతనికి నమస్కరించి, 'మీతో వాదము చేయుటకు అనుజ్ఞ యివ్వండి' అని ప్రార్థించాడు. ఈవిధంగా గురువుయొక్క ఆజ్ఞ తీసుకొని గురువుతోనే వాదము ప్రారంభించాడు. వేదశాస్త్రప్రమాణములకు విరుద్ధము కాకుండా గురువు వాక్యములను ఖండిస్తూ అత్యద్భుతంగా వాదించి గురువు మెప్పును పొందాడు.

లేతవయస్సులో శంకరునిలో ఉన్నత భావములు ప్రవేశించటం చాలా అదృష్టమని భావించాడు. ఒకనాడు అతనిని దగ్గరకు పిల్చుకొని, 'నాయనా! నీవు సకలవిద్యా పారంగతుడవైనావు. ఇంక నీవు యిక్కడ ఉండనక్కరలేదు. రేపటి దినమే నీవు కాశీకి బయలుదేరు. అక్కడ పండితులకు జ్ఞానము బోధించు. అద్వైత సిద్ధాంతమును జగద్వ్యాప్తి గావించు. దీనికి నీవు సమర్థుడవు' అన్నారు. గురువుల ఆజ్ఞను శిరసావహించి 16 సంవత్సరాల వయస్సులో తన శిష్యులను తీసుకొని కాశీకి బయలుదేరాడు.

తన సంచారకాలమందు కాశీపట్టణములో కొంతకాలము నివసించుటకు సంకల్పించినాడు. తన పదునాలుగుమంది శిష్యులతో దినము ఆ పుణ్యక్షేత్రము యొక్క వీధివీధులలో వేదఘోషలు చేశాడు. బ్రాహ్మణుల యిండ్లను ప్రవేశించి పండితుల సభలను సమావేశపరచి అద్వైతసిద్ధాంతమును నెలగొల్పినాడు. అటువంటి సమయములో ఒక బజారులో ఒక పాత గుడిసెలో ఒక పేద బ్రాహ్మణుని ఇంటికి వెళ్ళి కొంతసేపు ఆయనతో సంభాషించి ఆయన వ్యాకరణశాస్త్రమును పఠించుట చూచి, 'స్వామీ! ఈ వ్యాకరణమును చదివిన, దానితో లభించు ఫలితమేమి? ' అని ప్రశ్నించాడు. అప్పుడా బ్రాహ్మణుడు, 'స్వామీ! నా సంసారము పెద్దది. నాకు ఆస్తిపాస్తులు లేవు. ఏదో ఈ వ్యాకరణము పఠించి, పండితుడు అనిపించుకొన్న, ధనికుల నాశ్రయించి నా పరిస్థితి వివరించిన, నాలుగు

కాసులు సంపాదించి సంసారమును పోషించుకుంటాను. వట్టి బ్రాహ్మణుడన్న యేమీ దొరకదు. పండితుడన్న నాలుగు కాసులైనా యిచ్చి పంపుతారు' అన్నాడు. శంకరాచార్యులవారు అతనికి చెప్పవలసిన హితబోధనందించి తిరిగి నివాసమునకు వచ్చి తమ బోధను ఒక శ్లోకరూపముగా మార్చి శిష్యులకందించిరి.

భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే
సంప్రాప్తే సన్నిహితే కాలే నహినహి రక్షతి డుకృఞ్కరణే.

అనేదే ఆ బోధ. ఆ శ్లోకమును తెలుగులో చెప్పవలెనన్న

హరిగోవిందా హరిగోవిందా హరిగోవిందా అనరా మందా
మృత్యువు దాపున మసలేటప్పుడు వ్యాకరణము నిను కాపాడదురా.

ఆచార్యులవారు ఈ ప్రబోధను ప్రజలకు ప్రచారము చేయుటకు తమ శిష్యుల నాదేశించిరి. వారుకూడా గురువుల మెప్పుపొందుటకై ఒక్కొక్కరూ వేరువేరుగా పదునాలుగు శ్లోకములు రచించి ఆ బోధను విపులీకరించిరి. లోకకళ్యాణనిమిత్తమై శంకరులు ద్వాదశమంజరి అనే పేరున వ్రాసిన పన్నెండు శ్లోకములను ఆశీర్వచనములుగా గురువులనుగ్రహించిన నాలుగు శ్లోకములనూ వీటితో చేర్చి ఆ 31 శ్లోకములకూ 'భజగోవిందం' అనే పేరుపెట్టి ప్రచురించిరి. ఆ పవిత్ర గ్రంథరాజమునకు 'మోహ ముద్గరం' (మోహమును నాశనము చేయగల బలమైన ఆయుధము) అని కూడా పేరున్నది.' భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే' అనే పల్లవి మూలముగా మూఢమతులకు ఆత్మవిశ్వాసమును ఆచార్యులవారు బోధించుచున్నారు. ఆధేయమైన మూఢమతినుంచి ఆధారమైన ముక్తిమతికి జీవతత్త్వమును ఎక్కించే కొరకు ఆచార్యులవారు అనుగ్రహించిన నిచ్చెన ఈ మోహముద్గరము. ఒక్కొక్క దినము ఒక్కొక్క శ్లోకమును చదివి సుస్పష్టముగా అర్థము చేసుకొనిన, ఆనందనిలయముయొక్క ఉపరిభాగమును చేరవచ్చును. ఒక్కొక్క శ్లోకమూ ఆ నిచ్చెనలోని ఒక్కొక్క సోపానము. 'భజగోవిందం' శ్లోకములను పఠించిన ఆధ్యాత్మిక సాధనలో అభిరుచి పుట్టును. వివేక వైరాగ్య విచక్షణలు అభివృద్ధియగును. స్వస్వరూపమేమి అని తెలియును. అజ్ఞానము నశించి జ్ఞానజ్యోతి వెలుగును. మానవ జీవితమందు యౌవనదశ చాలా ముఖ్యమైనది. ఈ వయస్సులో జీవ.. ప్రకృతి.. ఈశ్వర సంబంధములను తెలిసికొని చిత్తశుద్ధిని సంపాదించుకొని ఆత్మ సాక్షాత్కారము కొరకై ప్రయత్నించుటకు పూనుకొనవలెను.

**పద్మపాదుని ఆదర్శము**

శంకరాచార్యుని శిష్యులలో ఒకడు చాలా పరిశుద్ధ హృదయుడు. మిగిలిన శిష్యులందరూ తర్క వ్యాకరణ శాస్త్రాలను, బ్రహ్మసూత్రాలను వల్లెవేస్తుంటే ఇతడు మాత్రం నిరంతరము గురుసేవలో నిమగ్నుడై ఉండేవాడు. తెల్లవారుఝామున స్నానము చేసిన తరువాత గురువుయొక్క వస్త్రాలను తీసుకువెళ్ళి గంగలో పిండుకొని సాయంకాలము తీసుకువచ్చేవాడు. ఒకనాడు అతడు గురువు నామాన్ని స్మరిస్తూ ఆ వస్త్రాలను ఉతుకుతుండగా అతనికి తెలియకుండా గంగనీరు ఉప్పొంగిపోతున్నది. కొద్దిసేపటికి నీటిమట్టం అతని కంఠం వరకు వచ్చింది. అప్పుడు తల ఎత్తి చూసాడు. అయితే తాను కొట్టుకుపోతానేమో అనే బాధ లేదతనికి. గురుసేవ చేయలేకపోతానేమో, సాయంకాలం లోపల గురువుకు వస్త్రాలు అందించలేకపోతానేమో అని చింతించాడు. చివరికి, 'నా ప్రాణం పోయినా ఫరవాలేదు, గురువుకు ఈ వస్త్రాలు అందించాలి' అని నిర్ణయించుకొని వాటిని తలపై పెట్టుకొని గురువును స్మరిస్తూ ఒక్కొక్క అడుగు వేస్తూ వచ్చాడు. అట్టి పవిత్రమైన భావం వల్ల అతడు అడుగు పెట్టిన చోటల్లా ఒక్కొక్క రాతి కమలం యేర్పడింది. అతని పేరే పద్మపాదుడు. శంకరులవారు అతని గురుభక్తికి మెచ్చి దగ్గరకు పిలచి ఆశీర్వదించారు. అంతకు పూర్వం మిగిలిన శిష్యులు పద్మపాదుణ్ణి మందమతియని హేళన చేసేవారు. కానీ ఎప్పుడైతే శంకరులవారు అతని తలపై చేయి పెట్టి ఆశీర్వదించారో అప్పుడే అతనికి సకల విద్యలూ సంప్రాప్తమైనాయి. మిగిలిన శిష్యులకంటె గొప్పగా వాటిని వివరించాడు. 'నాయనా! ఈ విద్యలన్నీ ఏవిధంగా నేర్చుకున్నావు?' అని అడిగారు శంకరులవారు. 'గురూజీ! సర్వమూ మీరే. మీకు నేను అర్పితం కావటం చేతనే ఈ విద్యలన్నీ నాకు కరతలామలకము లైనాయి' అన్నాడు.

**తొలగు! తొలగు!!**

శంకరాచార్యులవారు కాశీవిశ్వేశ్వరుని గుడికి లింగాభిషేకము కొరకు చేతిలో గంగాజలము నింపిన కమండలముతో వెళ్ళేసమయమున నాలుగు కుక్కలను వెంటబెట్టుకొని ఛండాల వేషము ధరించి ఈశ్వరుడు ప్రత్యక్షమైనాడు. అప్పుడు ఆదిశంకరుడు అసహ్యముతో, 'దూరం, దూరం' అన్నాడు. అప్పుడు ఆ వ్యక్తి, 'ఏమయ్యా! పరమసన్యాసీ! ఈ దేహమా దూరము పోవలసినది? దేహము జడపదార్థము. ఈ జడము జడదేహమునకు దూరముంటే యేమి లాభం? దగ్గరుంటే యేమి నష్టం? రెండూ జడమే! ఒకటి నుంచి మరొకటికి హాని ఎట్లు కలుగును? ఇంక ఆత్మనా దూరము పోవలసినది? ఆత్మ దానిలోనూ దీనిలోనూ ఒకటే కాబట్టి, దూరము దగ్గర అనే మాటే లేదే?' అని ప్రశ్నించినాడు. 'నన్ను కప్పుకొనిన అజ్ఞానమును నీవు పూర్తిగా తీసివేసినావు' అని ఆచార్యులవారు అతనికి నమస్కరించి తన తప్పును ఒప్పుకొన్నారు.

**అద్వైతసారం**

కాశీలో ఒకనాడు పండితుల సమావేశము జరిగింది. పండితులందరూ చేతులకు పెద్దపెద్ద కంకణాలు ధరించి, మెడలో రుద్రాక్షమాలలు వేసుకొని, ఖరీదైన శాలువలు కప్పుకొని ఠీవిగా వచ్చి కూర్చున్నారు. ఆ సభలో ఆడంబరమునకు యేమాత్రమూ లోటు లేకుండా ఉండినది. శంకరులవారు మాత్రం మోకాలు వరకు ఒక పంచె కట్టుకొని, ఒక చిన్న టవలు కప్పుకొని చాలా నిరాడంబరముగా వచ్చారు. పండితులు యితనిని చూచి, 'పండితుడంటే ఎంత గంభీరంగా ఉండాలి! ఇతని మెడలో ఒక్క రుద్రాక్షమాలైనా లేదు. ఇతను మాకు యేమి చెప్పగలడు?' అని తమలో తాము గుసగుసలాడుకోసాగారు. శంకరునిది చిన్న వయస్సు. వేదికెక్కాడు. చేతులు జోడించాడు.

వలదు వలదు ధనదాహము నరుడా!
మంచి బుద్ధితో మానుము కోర్కెలు
కర్మ ఫలితమే కదరా విత్తము
కలిగినంతలో కనరా తృప్తిని
హరిగోవిందా హరిగోవిందా
హరిగోవిందా అనరా మందా!

'ధనదాహమును వీడి దైవదాహమును, ధర్మదాహమును పెంచుకోండి' అని చక్కగా ఉపన్యాసము ప్రారంభించాడు.

'ఈ విశ్వమనే నాటకరంగములో మానవుడు కేవలం ఒక నటునివలె జీవించి, సుఖదుఃఖములను అనుభవించి చివరికి మరణించి మాయమౌతున్నాడు. ఈనాటి మానవుడు అభిమాన అహంకారములతో కూడియుండటంచేత బ్రతుకంతా భయంతో నిండియున్నది. నిర్భయమనేది జీవితంలో ఎక్కడా కనిపించటం లేదు. ఎక్కడుంది నిర్భయము? వైరాగ్యమెక్కడో నిర్భయమక్కడ. ఆ వైరాగ్యముకూడా దైవసన్నిధియందు మాత్రమే లభ్యమౌతుంది. కనుక, మానవులారా! మీరు భయాన్ని దూరంగావించుకొని అభయాన్ని పొందాలంటే ఆత్మసన్నిధి చేరండి. సుఖదుఃఖములు, పాపపుణ్యములు, లాభనష్టములు, చీకటివెలుగులు ఇవన్నీ ఒకదానికొకటి అభావములేగానీ వేరువేరు కాదు. వీటికి మూలాధారము ఒక్కటే. అదే ఆత్మ. పుష్పములోని రేకులు వేరువేరుగా కనిపించినప్పటికి అన్నీ ఒకే స్థానమునుండియే పుడుతున్నాయి కదా! అదేవిధంగా ఆత్మ నుండియే అన్నీ ఉద్భవిస్తున్నాయి. అనంతమైన సాగరమునుండి అసంఖ్యాకమైన అలలు బయలుదేరుతున్నాయి. ఒక అలవలె మరొక అల కనిపించటం లేదు. అయితే వీటన్నింటికి మూలాధారము సముద్రమే కదా! సముద్రములో ఏ చల్లదనము, ఏ ఉప్పదనము, ఏ తడి ఉన్నవో అవి ఈ అలలోనూ ఉన్నవి. ఈ అలలనుండి నురుగు ఆవిర్భవిస్తుంది. నురుగుకు అలలే ఆధారము. అలలకు సముద్రమే ఆధారము. అదేవిధంగా దేహము మనస్సును ఆధారం చేసుకొని ఉన్నది. మనస్సు ఆత్మను ఆధారం చేసుకొని ఉన్నది. కనుక, మానవత్వమునకు

మూలాధారము ఆత్మయే. ఇదియే అద్వైతము' అని బోధించాడు.

'పిట్ట కొంచెము, కూత ఘనము' అన్నట్లుగా, చూడటానికి చిన్నవాడుగా ఉన్నాడు కానీ, చెప్పే నీతులు చాలా గొప్పవిగా ఉంటున్నాయని అక్కడ చేరిన పండితులు, వారి శిష్యులు చాలా ఆశ్చర్యపోయారు. చెప్పే నీతులేకాదు అతని ప్రవర్తన కూడా చాలా గొప్పదిగా ఉండినది. త్రికరణ శుద్ధి శంకరాచార్యులవారియందు కొట్టవచ్చినట్లుగా కనిపించింది. 'అద్వైతమంటే ఏమిటి? జ్ఞానమంటే ఏమిటి?' అని పండితులు అనేకరకములుగా ప్రశ్నలు వేశారు. వారందరికీ సరైన సమాధానములిచ్చి సంతృప్తి పరచారు శంకరులవారు. ఏకాత్మయే అద్వైతము. అద్వైత దర్శనమే జ్ఞానము. బంగారము ఒక్కటైనా ఆభరణములు అనేకంగా ఉంటున్నాయి. చేతికి పెట్టుకుంటే కంకణమంటున్నారు. వ్రేలికి పెట్టుకుంటే ఉంగరమంటున్నారు. మెడలో వేసుకుంటే హారమంటున్నారు. నడుముకు చుట్టుకుంటే వడ్డాణమంటున్నారు. ఈ రూపనామములు వేరుగానీ బంగారమొక్కటే కదా!

శృంగారములు వేరు బంగారమొక్కటే
పశుల వన్నెలు వేరు పాలు ఒకటె
జీవజాతులు వేరు జీవుండు ఒక్కడే
పూలజాతులు వేరు పూజలొకటె
దర్శనంబులు వేరు దైవమొక్కడె.

ఈవిధంగా లోతుకు దిగి విచారిస్తే అంతా ఒక్కటే, ఒక్కటే!

**ఉభయభారతితో వాదం**

మండనమిశ్రుని కర్మ సిద్ధాంతమును ఖండించి అతనిని అద్వైత సిద్ధాంతములో ప్రవేశ పెట్టాడు. శంకరులవారు మండనమిశ్రుని వాదములో ఓడించినప్పుడు ముందుగా విధించిన షరతు ప్రకారం అతడు సన్యాసము స్వీకరించాలని పట్టుపట్టాడు. అప్పుడు మండనమిశ్రుని భార్యయైన ఉభయభారతి, 'శంకరా! నీకు సర్వ ధర్మములు తెలుసు. నేను అతనికి అర్ధాంగిని. కాబట్టి, నీవు నన్నుకూడా ఓడించినప్పుడే యీయన సన్యాసము స్వీకరించవలసి వస్తుంది. లేకపోతే లేదు' అన్నది. 'సరే! వాదింతమ'న్నారు శంకరులవారు. గృహస్థ ధర్మంలో కామశాస్త్రానికి సంబంధించిన ప్రశ్న వేసింది. దానికి సమాధానము శంకరులవారికి తెలియదు. అప్పుడు ఆమె దగ్గర ఒక నెల గడువు తీసుకున్నాడు. ఆ సమయంలో కాశీరాజు మరణించాడు. శంకరులవారు రాజుగారి దేహంలోనికి పరకాయ ప్రవేశం చేశారు. రాజు మరల బ్రతికాడని ప్రజలు ఎంతో ఆనందించి రాజభవనానికి తీసుకొనిపోయారు. అయితే ఆ దేహములో సంచరించేది రాజు కాదు, శంకరులే. గృహస్థాశ్రమంలో తాను ప్రవేశించాడు. దానితో శంకరునికి కొంత అపవిత్రత చేకూరింది. తక్షణమే రాజుయొక్క దేహాన్ని వదలి తిరిగి తన దేహములో ప్రవేశించి ఉభయభారతి వద్దకు పోయి ఆమె అడిగిన ప్రశ్నకు సమాధానము చెప్పాడు. తరువాత కాశ్మీరు పండితులను కూడా ఓడించాలని బయలుదేరాడు.

**కాశ్మీర్‌లో కాలుష్య క్షాళనం**

శంకరులవారు ఎప్పుడైతే కాశ్మీరులో ప్రవేశించారో తక్షణమే కొండపైనున్న కనకదుర్గ గుడి తలుపులు మూసుకున్నాయి. ఎవరెంత ప్రయత్నించినా అవి తెరుచుకోలేదు. అనేకమంది పండితులు వెళ్ళి ప్రార్థనలు సల్పారు. వారి భక్తిప్రపత్తులకు మెచ్చి శక్తిస్వరూపిణియైన దుర్గ అశరీరవాణిగా ఒక మాట చెప్పింది. 'శంకరులవారు గొప్ప ఆచార్యుడు. ప్రతి ఒక్కటి తాను ముందు ఆచరించి ప్రబోధిస్తూ వచ్చాడు. కాని, అతనిలో ఒకవిధమైన మాలిన్యము ప్రవేశించింది. దానిని పరిహారం గావించుకోటానికి ప్రయత్నించినప్పుడే తలుపులు తెరుచుకుంటాయి'. అప్పుడు శంకరులవారు తాను పరకాయ ప్రవేశములో రాజభవనములో అనుభవించిన దోషాన్ని గుర్తించి దాని పరిహారార్థమై పదకొండు దినములు నిద్రాహారపానీయాదులను త్యజించి తపస్సుచేస్తూ కూర్చున్నాడు. పన్నెండవ దినమున తలుపులు తెరుచుకున్నాయి. లౌకిక ప్రేమలో ప్రవేశించటం చేత శంకరులవారికి దోషము చేకూరింది. అయితే, అది తన

యిష్టపూర్వకంగా చేయలేదు. ఉభయభారతికి జవాబు చెప్పాలనే ఆ పని చేశాడు. దేహభావంతోకాక ఆత్మభావంతో ప్రేమించాలి. ఆత్మాభిమానమే నిజమైన ప్రేమ. అట్టి ప్రేమతత్త్వాన్ని మదిలో నింపుకొనే శంకరులవారు యావత్ప్రపంచానికి అద్వైత సిద్ధాంతాన్ని ప్రబోధించారు.

**తల్లికి తులసితీర్థం**

నీటినుండి కరెంటు పుడుతున్నాది. దానిని అనేకవిధములుగా మనం ఉపయోగించుకుంటున్నాము. కాని, కరెంటు కంటికి కనిపించదు కదా! అదేవిధంగా సమస్త జీవులూ ఆత్మతత్త్వమునుండియే ఆవిర్భవిస్తున్నాయి. జీవుల మంచిచెడ్డలు, జీవుల ప్రవర్తనలు మన కంటికి కనిపిస్తున్నాయి. ఆత్మ మాత్రం కంటికి కనిపించదు. అద్వైత సిద్ధాంతము కాశీలో నలుదిశలా ప్రాకిపోయింది. ఒకనాడు శంకరుని ప్రసంగాన్ని వినటానికి వేలాది ప్రజలు, పండితులు గుమిగూడారు. ఒక్కతూరి కన్నులు మూసుకొన్నారు శంకరులు. కాలడిలో కొన ఊపిరితోనున్న తన తల్లి కనిపించింది. ఇల్లు వదిలే సమయంలో, 'నాయనా! నీవు ఇల్లు వదలిపోతున్నావు. నాకిష్టం లేకపోయినా సన్యాసము స్వీకరించావు. కనీసం నా అంత్యసమయంలోనైనా నా దగ్గర ఉండాలి' అని కోరింది కదా! శంకరుడు చిత్తశుద్ధి కలిగినవాడు కనుక,తన వాగ్దానమును నిలబెట్టుకోవాలని సంకల్పించుకున్నాడు. చిత్తశుద్ధి కలిగినవారు యేది చెప్పినా సత్యమే అవుతుంది. శంకరుడు అప్పటికప్పుడు సభను నిలిపివేసి కాలడికి వెళ్లాడు. తల్లికన్ను మూయటానికి పూర్వమే అక్కడ ప్రత్యక్షమై ఆమె నోటిలో తులసి తీర్థం పోసి ఆమెకిచ్చిన వాగ్దానము నిలబెట్టుకున్నాడు.

**అసాహాయంగా అంత్యక్రియలు**

ఆర్యాంబకు దహనసంస్కారము చేయటానికి ఆ గ్రామంలో శంకరులవారికి సహాయం చేసేవారే లేకపోయారు. ఆనాటి పరిస్థితులనుబట్టి కాలడి ప్రజలు శంకరులవారు తన తల్లికి అంత్యక్రియలు చేయటాన్ని వ్యతిరేకించారు. ఎందుచేతనంటే సన్యాసైనవాడు కర్మకాండలో ప్రవేశించకూడదు. అసలు సన్యాసమనగా ఏమిటి? సమస్త ఆశలను త్యజించటమే. సన్యాసము స్వీకరించేవారు మొట్టమొదట విరజాహోమము చేస్తారు. అనగా తాము మరణించినట్లు భావించి తమ శ్రాద్ధ కర్మలు తామే చేసుకొని నూతనమైన నామము, నూతనమైన వేషము ధరిస్తారు. ఈవిధంగా విరజాహోమంలో తమ తద్దినము తామే పెట్టుకున్న తర్వాత ఇక తల్లి ఎక్కడ? తండ్రి ఎక్కడ? కనుకనే, సన్యాసికి ఎవరితోనూ సంబంధముండకూడదు. తాను కర్మకాండలో ప్రవేశించకూడదు. సన్యాసియైనవాడు కర్మకాండలో ప్రవేశించటం ధర్మవిరుద్ధమని, శంకరాచార్యులవారు ధర్మవిరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని భావించి అతని తల్లి దేహాన్ని స్మశానమునకు తీసుకుపోవటానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. నంబూద్రి బ్రాహ్మణులు ముట్టటానికి కూడా వీలుకాదన్నారు. విధిలేక తల్లి దేహము తానే భుజముపై వేసుకొని తన యింటి పెరటిలోనే గుంత త్రవ్వి అక్కడే పూడ్చివేశాడు. ఈనాటికీ కేరళలో ఎవరింట్లోనైనా పెద్దలు మరణిస్తే వారిని యింటి పెరటిలోనే పూడ్చిపెట్టటం జరుగుతోంది. శంకరులవారు తన తల్లికిచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చుకొని తిరిగి కాశీకి వెళ్ళిపోయారు.

**అపరాధత్రయం**

ఒకానొక సమయంలో ఆదిశంకరుడు దిగ్విజయయాత్ర సలిపి మరల పుణ్యక్షేత్రమైన కాశీ పట్టణాన్ని చేరుకున్నాడు. అక్కడ కాశీవిశ్వనాథుని దర్శించి ప్రార్థించాడు. ఏమని?.. 'ఈశ్వరా! నా పాపములను పరిహారం గావించుకొనే నిమిత్తమై నేను యిక్కడికి వచ్చాను' అన్నాడు. 'ఆదిశంకరులు సాక్షాత్తు శంకరస్వరూపులు కదా! ఏమి పాపం చేశాడు? పుట్టినది మొదలుకొని వేదశాస్త్రములను, ఉపనిషత్తులను, ఇతిహాసములను అధ్యయనం చేస్తూ ఆధ్యాత్మిక మార్గంలో తన జీవితాన్ని సార్థకం గావించుకున్న శంకరులు చేసిన పాపమేమిటి?' అని అనుకొన్నారు అతని శిష్యులు.

'నేను మూడు పాపములు చేశాను శంకరా! ఆ మూడు పాపములను పరిహారం గావించుకొనుటకు వచ్చాను' అన్నాడు ఆదిశంకరులు. ఐతే, మొదటి పాపము ఏమిటి? 'ఓ శంకరా! భగవంతుడు మనస్సుకు, వాక్కుకు అతీతమైన

వాడని తెలుసుకొన్నానేగాని, ఆచరణలో పెట్టలేకపోతున్నాను. నిన్ను వర్ణించటం అసాధ్యమనుకొన్నాను కాని...

'ఈశ గిరీశ పరేశ పన్నగ భూషణ నమో

సాంబసదాశివ శంభోశంకర శరణం మేతవ చరణ యుగం'

అని నిన్ను వర్ణిస్తున్నాను. ఇది పాపం కాదా! 'యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' నీవు వాక్కుకు అతీతమైన వాడవని తెలుసుకొన్నప్పటికీ దానిని ఆచరణలో పెట్టకుండా వర్ణించటానికి ప్రయత్నిస్తున్నాను. తలచినది, చెప్పినది వేరువేరుగా ఉండటంచేత అది పాపమే' అన్నాడు. మరి రెండవ పాపమేమిటి? 'ఈశ్వర స్సర్వ భూతానం' 'ఈశావాశ్యమిదం సర్వం' అని నేను చెబుతున్నాను, విశ్వసించాను. కాని, నిన్ను దర్శించటానికి కాశీ వచ్చాను. నేను చెప్పేదొకటి, తలచేది మరొకటి, చేసేది వేరొకటి. ఇదికూడా పాపమే కదా!' అన్నాడు. ఇంక మూడవ పాపమేమిటి? 'ఏకాత్మ సర్వభూతాంతరాత్మ' నీయందు, నాయందు ఉన్నది ఒకే ఆత్మ. 'ఏకమేవాద్వితీయం బ్రహ్మ' దీనిపై నాకు సంపూర్ణ విశ్వాసమున్నది. నీవు, నేను ఒక్కటే అని విశ్వసించి, ఒక్కటేయని ఉపన్యాసాలు చేశాను. కాని, నిన్ను భిన్నంగా చూస్తున్నాను. ఇది మూడవ పాపం. ఈ మూడు పాపాలను పరిహారం చేసి నాకు అద్వైతమనే దివ్యత్వాన్ని ప్రసాదించుము' అని కోరాడు.

శంకరులవారు యావద్భారత దేశంలో కాశ్మీరు మొదలుకొని కన్యాకుమారి వరకు పర్యటించి అద్వైత సిద్ధాంతమును ప్రబోధించారు. 'ఉన్నది ఒక్కటే. రెండు కాదు. చెఱకులోని రసము వలె భగవంతుడు అందరియందు రసస్వరూపుడై ఉంటున్నాడు. కాని, మీరు కేవలం రూపనామములను ఆధారం చేసుకోటం చేత భిన్నత్వాన్ని భ్రమిస్తున్నారు. బంగారము లేక నగలు లేవు. మట్టి లేక కుండలు లేవు. అట్లే ఈ జగత్తులోని రూపనామములన్నింటికీ మూలాధారమైన దివ్యత్వం ఒక్కటే' అని పండితులతో వాదించి ఒప్పించాడు. క్రమక్రమేణా శంకరులవారి అద్వైత సిద్ధాంతమును అందరూ అంగీకరిస్తూ వచ్చారు.

**పీఠాల స్థాపన**

ఒకనాడు శంకరులవారు ప్రయాణమై వెడుతున్నారు. తుంగభద్రానదీ తీరమందు ఒకచోట పాము, కప్ప సమైక్యముగా, స్నేహముగా ఉండటం చూసారు. ఎండ అధికంగా ఉండటం వలన సర్పము పడగ విప్పి కప్పకు నీడనివ్వటం కనిపించింది. ఆ ప్రదేశము ద్వేషరహితమైనదని గుర్తించి అక్కడే శృంగేరీ పీఠమును స్థాపించారు. దీని అంతరార్థమేమిటి? స్థానము కూడా పవిత్రంగా ఉంటుండాలి. పూరీ, ద్వారక, శృంగేరి, బదరీ, కాశీ క్షేత్రాల్లో ఐదు లింగములను ప్రతిష్ఠించారు. కంచిలో యోగలింగమును పెట్టారు. మండనమిశ్రునికి సురేశుడని పేరు పెట్టి కంచి పీఠాధిపతిగా చేశారు. విద్యారణ్యులుకూడా శంకరుని శిష్యులే. శంకరులు ఉపాసనా మార్గమందు ప్రజలకు ఉత్సాహమునందించి తద్వారా భక్తిప్రపత్తులను అభివృద్ధి చేయుటకు దేవతాస్తోత్రములు ఎన్నియో రచించిరి. వారు స్థాపించిన పీఠాధిపతులుకూడా దైవారాధన చేయుచూ, ప్రజలకు మార్గదర్శకులుగా కర్మమార్గమును అనుసరించుచున్నారు. అద్వైత ప్రబోధలకు ఉపాసనామార్గము, కర్మమార్గములు తోడునీడగా ఉండునని వీరి అభిప్రాయము.

ప్రస్థానత్రయమునకు అద్వైత రీత్యా వ్యాఖ్యానమును రచించి తన కాలమును, కాయమును పవిత్ర భారత జననియొక్క సేవకై, మానవ కులముయొక్క ఉద్ధారము నిమిత్తమై అర్పితము చేశారు. తన 32వ యేటనే శంకరులవారు శరీరాన్ని త్యజించారు. కారణమేమిటి? తాను వచ్చిన పని అయిపోయింది.